క్లుప్తంగా

'పాఠశాలల వద్ద ట్రాఫిక్‌ను నియంత్రిస్తాం'



ఖలీల్‌వాడి: పాఠశాలల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను నియంత్రిస్తామని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ అన్నారు. నగరంలోని ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీని టీచర్లు సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పాఠశాలల పునః ప్రారంభ సందర్భంలో ఖిల్లా రోడ్డు, శంకర్ భవన్, విశ్వశాంతి తదితర ప్రాంతాలలో ప్రత్యేకంగా ట్రాఫిక్ నియంత్రణ చేపడతామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాల యాజమాన్యాలు కూడా ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన ఉండాలని, తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోండి

నిజామాబాద్ సిటీ: ప్రభుత్వం 3 నెలలకు సరిపడా రేషన్ బియ్యం ఇదే నెలలో పంపిణీ చేయడంతో జనం తిప్పలు పడుతున్నారని, రేషన్ షాప్‌ల వద్ద ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు నూర్జహాన్ కోరారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలోని పలు రేషన్ షాపులను సీపీఎం, ఐద్వా నాయకులు స్వయంగా పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల వద్ద ప్రజలు బారులు తీరడం, గంటల తరబడి ఎదురుచూడటం వంటి సమస్యలున్నాయన్నారు. కొన్ని చోట్ల సర్వర్ సైతం మొరాయిస్తుందన్నారు. ఒక్కొక్కరికి 6 సార్లు ఫింగర్ ప్రింట్స్ తీసుకోవడంతో జాప్యం జరుగుతోందన్నారు. సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు సుజాత, భూమేష్, గంగాధర్, హైమద్, నిర్మల, షాజహాన్ పాల్గొన్నారు.

మొరాయిస్తున్న ఇందల్వాయి రైల్వే గేటు

ఇందల్వాయి: మాన్యువల్ నుంచి ఎలక్ట్రికల్ సిస్టంకి మార్చిన నాటి నుంచి ఇందల్వాయి మండల కేంద్రంలో ఉన్న రైల్వే గేటు సరిగ్గా తెరుచుకోక తరుచూ మొరాయిస్తుంది. రైలు వెళ్లగానే విధుల్లో ఉన్న సిబ్బంది బటన్ నొక్కగానే సాంకేతిక సమస్యలు తలెత్తి ఒక వైపు గేటు మాత్రమే తెరుచుకుంటుంది. దీంతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. ఇకనైనా రైల్వే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

'నివాస స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలి'



నిజామాబాద్ రూరల్: మాధవనగర్ నాలుగో డివిజన్ డి-4 కెనాల్ కట్టపై నరసన్న కాలనీవాసుల నివాస్థలాలకు పట్టాలు ఇప్పించాలని తెలంగాణ రైతు కూలీ సంఘ జిల్లా అధ్యక్షుడు పల్ల మహేష్, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డిని కోరారు. కంఠేశ్వర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాధవనగర్ నరసన్న కాలనీ వాసులు, జిల్లా రైతు కూలీ సంఘఅధ్యక్షుడు పల్ల మహేష్‌లు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా అక్కడే నివాసం ఉంటూ అన్ని కులాల వారు కూలి పనులు చేసుకుంటూ గుడిసెలలో నివసిస్తున్నారని అన్నారు. వెంటనే స్పందిచిన రూరల్ ఎమ్మెల్యే, అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తానని బాధితులకు రూరల్ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తెలంగాణ రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్, సత్యనారాయణ, నర్సింలు, శంకర్, నర్సింలు తదితరులు పాలొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి



నిజామాబాద్ లీగల్ : న్యాయవాదులు ఎదు ర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి రెడ్డి కోరారు. ఈ మేరకు తెలంగాణ బార్ కౌన్సిల్ సెక్రెటరీ నాగలక్ష్మికి హైదరాబాద్‌లో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ నడుమ తెలంగాణ బార్ కౌన్సిల్ జూన్ 9 నుంచి న్యాయవాదుల వెల్ఫేర్ టికెట్ల ధరను పెంచింది.. పెంచిన మొదటి విడత టికెట్లను ఆమె, సాయిరెడ్డికి అందజేశారు. అనంతరం సాయి రెడ్డి మాట్లాడుతూ.. వెల్ఫేర్ టికెట్ల ధర పెంపుతో న్యా యవాదులకు మరిన్ని సంక్షేమ ఫలాలు అందనున్నాయని వివరించారు. ప్రతి న్యాయవాదికి హెల్త్ కార్డు ఇవ్వాలని, వేల్ఫేర్ ఫండ్‌లో చేరే న్యాయ వాదుల గరిష్ట వయసు 45 సంవత్సరాలకు పెంచాలని, జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ ఇవ్వాలని కోరారు.

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

- పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప ప్రాజెక్టు నిర్మాణం
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



ముల్లంగి గ్రామంలో మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి: శ్రీమహాలక్ష్మి అమ్మవారి దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి అన్నారు. శుక్రవారం ముల్లంగి(ఐ) గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీమహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మీ అందరి ఆశీర్వాదంతోనే తాను ఇప్పుడు ఎమ్మెల్యేగా మీముందున్నానని పేర్కొన్నారు. ముల్లంగి గ్రామాభివృద్ధి కోసం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్‌రెడ్డి, వీడీసీ సభ్యులు కోరిన అభివృద్ధి పనులకు, మహిళా సంఘ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు 21వ ప్యాకేజీలో భాగంగా మంచిప్ప ప్రాజెక్టు నిర్మాణ పనులు పాత డిజైన్ ప్రకారమే పూర్తి చేసేందుకు ఇప్పటికే తాను సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చైర్మన్ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులతో మాట్లాడినట్లు తెలిపారు. వారం రోజుల్లోనే పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తాయని తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలసాని శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు కంచెట్టి గంగాధర్, సీహెచ్ నర్సయ్య, సొసైటీ చైర్మన్లు గంగారెడ్డి, రాంచందర్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్‌లు గంగారెడ్డి, దేవకరుణ, వీడీసీ అధ్యక్షుడు అప్కారీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పాట ఆవిష్కరించిన ఎమ్మెల్యే



పాట ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే

ధర్పల్లి: ధర్పల్లి మండల కేంద్రానికి చెందిన రచయిత సాయికుమార్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ చరిత్ర ప్రతిబింబించేలా పోరాటాలపై రాసిన పాటను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు పాట రూపంలో వివరించినందుకు రచయిత సాయికుమార్, గాయని తన్విలాను ఎమ్మెల్యే అభినందించారు. నాయకులు చలిమెల నరసయ్య, మిట్టపల్లి గంగారెడ్డి, మనోహర్ రెడ్డి, రాజేష్ తదితరులున్నారు.

అంగరంగ వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

- హాజరైన హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి
- ప్రత్యేక పూజలు చేసిన రూరల్, అర్బన్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కవిత



అన్నదానం చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ఆలయంలో భక్తులతో ఎమ్మెల్సీ కవిత



సారంగాపూర్‌లో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న విద్యారణ్య భారతి స్వామి

నిజామాబాద్ రూరల్: నగరంలోని 13వ డివిజన్ పరిధిలో ఉన్న సారంగాపూర్ అభయ ఆంజనేయ స్వామి, గణపతి, నవగ్రహ, నాగ దేవత, శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం చివరి రోజు హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అభయ ఆంజనేయ ఆలయాన్ని రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు ప్రజాప్రతినిధులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, రూరల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉమ్మాజీ నరేష్, కాంగ్రెస్ నాయకులు కుంచపు నగేష్, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, సుదర్శన్‌గౌడ్, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



సిరికొండ: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు తూంపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు జెడ్పీహెచ్ఎస్ పీడీ నగేష్ శుక్రవారం తెలిపారు. ఆర్మూర్‌లో ఈనెల 5న నిర్వహించిన సబ్ జూనియర్ బాలుర ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. గ్రామానికి చెందిన విశాల్, లోకేష్, సిద్దు, భరత్ ,శివశంత్, అఖిల్, జస్వంత్, వర్షిత్, కళ్యాణ్ ఎంపికైనట్లు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 9 నుంచి ఈ పోటీలు జరగనున్నట్లు పీడీ తెలిపారు.

ఆలయాల పరిరక్షణ మనందరి బాధ్యత



సుభాష్‌నగర్: హిందూ ఆలయాల పరిరక్షణ బాధ్యత మనందరిదని, ఆలయాల అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని న్యాల్‌కల్‌లోగల శ్రీరామదాసు ఆంజనేయ స్వామి, సీతారాంనగర్ కాలనీలోగల శ్రీ భక్త గణేష్ ఆంజనేయ స్వామి, నాందేవ్‌వాడలోగల శ్రీ మహామైసమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనకు స్వాగతం పలకగా, వేదపండితులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, దేవాలయాల సందర్శన ద్వారా పిల్లలకు మన సంస్కృతీ సంప్రదాయాలు తెలుస్తాయన్నారు.

రోడ్డు పక్కన చెట్ల నరికివేత

డిచ్‌పల్లి: ప్రయాణికులకు నీడనిచ్చేందుకు, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం హరితహారం పేరిట కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మరీ ప్రతి యేటా మొక్కలు నాటుతోంది. అవి చెట్లుగా మారి ప్రజలకు ఉపయోగపడే వేళ కొందరు వాటిని నరికివేస్తూ పర్యావరణానికి చేటు చేస్తున్నారు. విద్యుత్ తీగలకు తగులుతున్నాయని, సాగు సమయంలో పంటలకు నీడ వస్తోందని చెబుతూ అటు విద్యుత్ సిబ్బంది, ఇటు పలువురు రైతులు చెట్లను యథేచ్ఛగా నరికివేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. శుక్రవారం డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ – ఆరేపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఒక పక్క ఇలా చెట్లను నరికివేశారు.



బర్ధిపూర్- ఆరేపల్లి శివారులో నరికివేతకు గురైన చెట్లు

జిల్లా న్యాయవాదుల సహకార సొసైటీ కార్యవర్గం ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు

నిజామాబాద్ లీగల్: నిజామాబాద్ జిల్లా న్యాయవాదుల సహకార సొసైటీకి శుక్రవాయం ఎన్నికలు నిర్వహించారు. కోర్టులోని న్యాయవాదుల సహకార సొసైటీ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఎర్రం విఘ్నేష్ ఆధ్వర్యంలో సమావేశమైన సొసైటీ డైరెక్టర్లు నిజామాబాద్ కోర్టు న్యాయవాది కొండడ్ల శ్రీనివాస్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బోధన్ కోర్టు న్యాయవాది రవీంధర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణాగౌడ్, సంయుక్త కార్యదర్శిగా ఆర్మూర్ కోర్టు న్యాయవాది గంట విష్ణు కిరణ్, కోశాధికారిగా శ్రీనివాస్ గౌడ్ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి తెలిపారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాణిక్ రాజ్, డైరెక్టర్లు సంతోష్, శంకర్, కృష్ణగోపాల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జక్రాన్‌పల్లి: కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు కలుసుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకొని ఆనందంగా గడిపారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయులు విజయ్ కుమార్, రాజేందర్, హయగ్రీవ చారి, గుద్దేటి రాజన్న, గంగాధర్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో 2000-01 బ్యాచ్ విద్యార్థులు

బహ్రెయిన్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



మోర్తాడ్(బాల్కొండ): బహ్రెయిన్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను తెలంగాణ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ప్రతి ఏటా నిర్వహించుకుంటున్నామని వలస కార్మికులు వెల్లడించారు. జానపద గేయాలు, తెలంగాణ గీతం ఆలపించి మిఠాయిలు పంచుకున్నారు. సంఘం సభ్యులు ప్రేమ్ సాగర్, పోచన్న, తదితరులు పాల్గొన్నారు.

కళ్లను కాపాడుకోవడం చాలా ముఖ్యం



పెన్షనర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నిజామాబాద్‌నాగారం: వృద్ధాప్యంలో కళ్లను కాపాడుకోవడం చాలా ముఖ్యమని, సీనియర్ సిటిజన్లకు ,పెన్షనర్లకు కంటి పరీక్షలు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయటం ఎంతో అభినందనీయమని ప్రముఖ కంటి వైద్యుడు శరత్ జోషి అన్నారు. శుక్రవారం నగరంలోని నాందేవ్‌వాడలో గల ఆల్ పెన్షనర్స్- సీనియర్ సిటిజెన్స్ భవన్‌లో అగర్వాల్ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన కంటి శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలువురు పెన్షనర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 140 మంది పెన్షనర్లకు ఈ సందర్భంగా వివిధ రకాల పరీక్షలు చేపట్టారు. పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఈవీఎల్ నారాయణ, ఎండీ హమీదుద్దీన్, సాంబశివరావు, శ్రీమతి మేరీ, లక్ష్మీనారాయణ, లావు వీరయ్య, రైసుద్దీన్, సిర్ప లింగయ్య, మధుసూదన్, అగర్వాల్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



సారంగాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు



ఘన్‌పూర్ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

నిజామాబాద్‌రూరల్/నిజామాబాద్ అర్బన్/డిచ్‌పల్లి/మోపాల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ఉచిత విద్య అందుతుందని ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం రూరల్, అర్బన్ నియోజకవర్గాల పరిధిలో పలు చోట్ల బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కొన్ని చోట్ల గ్రామ సభలు జరిపారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పలుచోట్ల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని వారికి విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కల్పిస్తూ అధునాతనమైన విద్య అందిస్తున్నామన్నారు.అధిక ఫీజులు వసూలు చేస్తూ, సరైన విద్యార్హతలు లేని వారితో విద్యాబోధన నిర్వహించే ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో చేరి నాణ్యమైన విద్య అందుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరుస్తామని తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవోలు, బడిబాటపై ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.



మోపాల్: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి గోవింద్‌రావు



నిజామాబాద్ అర్బన్: మాట్లాడుతున్న హెచ్‌ఎం రాంచందర్ గైక్వాడ్

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



బర్ధిపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న డిచ్‌పల్లి తహసీల్దార్ సతీష్‌రెడ్డి



బైరాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రామేశ్వర్

డిచ్‌పల్లి: భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి రెవెన్యూ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చిందని, రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిచ్‌పల్లి తహసీల్దార్ కె.సతీష్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం బర్ధిపూర్, డిచ్‌పల్లి ఖిల్లా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. బర్ధిపూర్‌లో 137, డిచ్‌పల్లి ఖిల్లాలో 183 దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు. ఆర్‌ఐలు సంతోష్, భూపతి ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్: భూభారతి చట్టం రెవెన్యూ సదస్సులు శుక్రవారం కొనసాగాయి. నాలుగో రోజు ముదక్‌పల్లి, బైరాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా..269 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ రామేశ్వర్ తెలిపారు. సదస్సుల్లో డీటీ సరిత, ఆర్ఐ రాజేశ్వర్, ఏఆర్ఐ రమ్య, సర్వేయర్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

'సేవలో తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుంది'

నిజామాబాద్ నాగారం: సమాజసేవలో తమ సంస్థ ఎప్పుడు ముందుంటుందని, నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటామని ఇందూరు యువత వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఇందూరు యువత కార్యాలయంలో నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మనిషిగా మరో మనిషి బాధను అర్థం చేసుకుని అండగా నిలవడమే నిజమైన మానవత్వమన్నారు. అభాగ్యులకు అన్నదానం, విధివంచితులకు సపర్యలు, అనాథ శవాలకి అంత్యక్రియలు 15 ఏళ్లుగా సేవలందిస్తున్నామన్నారు. అనంతరం వివిధ మండలాల్లో ఇందూరు యువతకి సంబంధించన వలంటీర్లను అలాగే సంస్థకి సహకరిస్తున్న వారిని సన్మానించారు. సంస్థ ఉన్నతికి, మరిన్ని సేవా కార్యక్రమాలు చేసే దిశగా కొత్త కార్యవర్గం కృషి చేస్తుందన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా మద్దుకూరి సాయిబాబు, ఉపాధ్యక్షులు జీఆర్ సుజాత, ప్రధాన కార్యదర్శి వాలా బాలకిషన్, సంయుక్త కార్యదర్శిగా రాజేష్ శర్మ, కోశాధికారిగా జయదేవ్ వ్యాస్, ఎక్జిక్యూటివ్ మెంబెర్స్‌గా ఎంవీ సుజాతా రెడ్డి, మద్ది గంగాధర్, ఐలేని సంతోష్ రెడ్డిలను ఎంపిక చేశారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,500	వెండి(కిలో)	1,04,000
22 క్యారెట్స్	90,002	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	18	30	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	50	70	దోసకాయ	15	30
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	80	130	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిపువ్వు	40	60
వంకాయ	25	50	బీట్‌రూట్	25	50
పాలకూర	80	120	కరివేపాకు	40	60
మెంతికూర	100	140	చామగడ్డ	30	50
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	50	70
పుదీనా	70	100	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	90	మామిడికాయ	30	50

-సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
- స్క్రీన్-1 థగ్‌లైఫ్ -1.25.7.35, 10.40
- స్క్రీన్-2 శ్రీశ్రీశ్రీ రాజావారు-10.40, 4.40, 10.35 - భైరవం-1.40, 7.40
- స్క్రీన్-3 హౌస్‌ఫుల్-5(హిందీ)-10.30, 1.25, 4.30, 7.35, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
- స్క్రీన్-1 కరాటే కిడ్ లెజెండ్స్-11.00
- మిషన్ ఇంపాజిబుల్(ఇంగ్లీష్)-1.15
- భైరవం-4.45, 10.35
- భూల్ చుక్ మాఫ్(హిందీ)- 7.55
- స్క్రీన్-2 హౌస్‌ఫుల్-5(హిందీ)-9.40, 3.40, 7.10, 10.40
- ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-1.10
- స్క్రీన్-3 ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-11.30
- బద్మాషులు-2.00 ,థగ్‌లైఫ్-4.35, 10.40
- పాదేరు 12 మైలు-8.00
- స్క్రీన్ -4 మిషన్ 007-11.05
- హౌస్‌ఫుల్-5బి(హిందీ)-1.40
- శ్రీశ్రీశ్రీ రాజావారు-5.10, 10.45
- ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-8.15

లలితామహల్ భైరవం **దేవి** శ్రీశ్రీశ్రీ రాజావారు
నటరాజ్ హౌస్‌ఫుల్-5(హిందీ) **విజయ్** థగ్‌లైఫ్